ప్రజాశక్తి
బుధవారం 10 మే 2023
5
అనంతపురం






కలుషితనీరు తాగి అస్వస్థతకు గురైన ప్రాంతంలో పర్యటించి, బాధితులతో మాట్లాడుతున్న అధికారులు

అమ్మ గాడిదా..!

◆ వడ్డిపల్లి వద్ద గాడిదల ఫామ్
◆ రూ.50 లక్షల పెట్టుబడితో ఏర్పాటు
◆ వ్యాపారంగా ప్రారంభించిన యువజంట



గాడిద పాలు తీస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'సదువుకోకపోతే గాడిదలుకాయాలిరా'.. అనే మాటలను చిన్నప్పుడు అందరూ వినే ఉంటాం. పని చేయకుండా సోమరిగా ఉండేవారిని గాడిదలు కాయరా అనే సంబోధించేవాళ్లం. ఇది గతం.. ఇప్పుడు ఏకంగా గాడిద పెంపకం కేంద్రాలు ఆవిష్కృతం అయ్యాయి. వినడానికి ఇది ఆశ్చర్యంగా ఉన్నా అనంతపురం కేంద్రంగా గాడిదల పెంపకం చేసే ఫామ్‌ను ఇటీవల ఏర్పాటు చేశారు. ఇది వినడానికి వింతగానూ, ఆశ్చర్యంగానూ ఉండవచ్చు. అనంతపురం జిల్లాకు చెందిన ఒక యువజంట ఈ గాడిదల పెంపక వ్యాపారాన్ని ప్రారంభించింది. గాడిదల పాలు, మాంసంలోనూ ఔషధ గుణాలున్నాయన్న ప్రచారం సాగుతున్న నేపథ్యంలో ఇటువంటి ఫామ్‌లు వెలుస్తుండటం గమనార్హం. అయితే గాడిదపాలలో ప్రత్యేకమైన ఔషధ గుణాలేవీ లేవని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయినా వీటి పెంపెకం మాత్రం వ్యాపారాత్మకంగా మారుతోంది.

వడ్డిపల్లిలో గాడిదల ఫామ్

అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం పరిధిలోని వడ్డిపల్లి సమీపంలో వెంకటేశ్వర్లు, తేజశ్విణి అనే యువజంట ఏడు ఎకరాల పొలాన్ని లీజుకు తీసుకుని అందేలో గాడిదల ఫామ్‌ను ఏర్పాటు చేశారు. గాడిదలు మూడు నాలుగు రకాలుంటే ఇక్కడ వీరు పెంచుతున్న రకమైన హలేరీ రకం గాడిద. దీన్ని గుజరాత్ రాష్ట్రంలో ఒక్కో గాడిదను రూ.1.50 లక్షల వెచ్చించి కొనుగోలు చేశారు. ఈ రకంగా 28 గాడిదలను ఈపామ్‌లో ఉంచారు. చుట్టూ ప్రహరీతోపాటు, ఆవుల షెడ్‌లాగా వీటికి ప్రత్యేకంగా ఒకషెడ్‌ను ఏర్పాటు చేశారు. సుమారు రూ.50 లక్షల వరకు పెట్టుబడిని ఈ యువ జంట పెట్టింది. వీటి సంరక్షణకు ప్రత్యేకంగా కొంత మందిని నియమించారు. ఇంత పెద్ద ఎత్తున పెట్టుబడిన వీరికి రాబడి ఏ మేరకు అన్నది సందేహాస్పదంగానే ఉంది. లీటరు పాలు రెండు వేల వరకు పలుకుతున్నప్పటికీ రెగ్యులర్‌గా ఈ పాలను కొనేవారు లేరని పామ్ యజమానులు చెబుతున్నారు. తమకు ప్రోత్సహం అందివ్వాలని కోరుతున్నారు

భిన్నమైన వాదనలు

ఈ గాడిదల ఫామ్ గురించి తెలిసి అధికారులే విస్మయం చెందారు. ఇటువంటి ఆలోచన రావడం, పెంపకం చేపట్టడం విని వారు ఆశ్చర్యం వ్యక్తం చేస్తుండటం గమనార్హం. గతంలో బ్రూక్స్ అనే స్వచ్ఛంద సంస్థ గాడిల సంరక్షణపై సదస్సు ఏర్పాటు చేసిన సమయంలో ఈ వినూత్న ప్రయత్నం అంశం చర్చకు వచ్చింది. పాలల్లోనూ ఔషధ గుణాలున్నాయన్న చర్చపై పశుసంవర్ధక శాఖ అధికారుల్లోనూ భిన్నమైన వాదనలున్నాయి. ప్రత్యేకమైన ఔషధ గుణాలున్నట్టు వైద్య పరీక్షల్లో నిర్ధారణ జరగలేదని చెబుతున్నారు.



వడ్డిపల్లి ఫామ్‌లో ఉన్న గాడిదలు

డిమాండ్ ఉంటుందని పెట్టాం : వెంకటేశ్ ఫామ్ యజమాని

కోవిడ్ సమయంలో మా ఇంట్లో ఒకరు అనారోగ్యం గురై అస్మా లక్షణాలు కనిపించాయి. ఆ సమయంలో ఎవరో చెబితే ఈ పాలను తాపించాం. ఆరోగ్యం కొంత మెరుగైనట్టు అనిపించింది. ఈ సమయంలోనే తాము ఈ వ్యాపారంపై దృష్టి పెట్టాం. ఉత్తారాదికెళ్లి అక్కడ కొన్ని చోట్ల ఉన్న ఇటువంటి ఫామ్‌ను పరిశీలించాం. ఇక్కడ పెడితే బాగుంటుందని భావించి ఏర్పాటు చేశాం. పాలు అయితే వస్తున్నాయి. కాని మార్కెటింగ్ లేదు. మాలాగానే రాష్ట్రంలో మరికొంత మంది వీటిని ఏర్పాటు చేశారు. ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్సు అథారిటి ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నారు. ఆ అనుమతులొస్తే షాపింగ్ మాల్స్‌లో పెట్టి ఈ పాలను ఇతర పాలతో సమానంగా అమ్మేందుకు అవకాశముంటుంది. అదే రకంగా పాల ఉత్పత్తులను తయారు చేసి విక్రయించేందుకు వీలుంటుంది. చాలా రిస్కు చేసి ఈ వ్యాపారంలోకి దిగాం. ప్రభుత్వం వైపు నుంచి కూడా ప్రోత్సహం లభించాలని కోరుకుంటున్నాం.

బేలోడులో కలుషిత నీరు

◆ పలువురికి అస్వస్థత
◆ గ్రామంలో అధికారుల పర్యటన

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

మండల పరిధిలోని బేలోడు గ్రామంలో కలుషిత నీరు తాగి పలువురు అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం నాడు ఈ ఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఉన్నాయి... బేలోడు గ్రామంలో పంచాయతీ కొళాయిల ద్వారా సరఫరా అవుతోంది. ఇటీవల సరఫరా అయిన ఈ నీటిని గ్రామస్తులు తాగారు. సోమవారం రాత్రి, మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన రంగప్ప, మారెక్క, రామప్ప, తిప్పేస్వామి, లక్ష్మీదేవి, మాణిక్యమ్మ, లావణ్య, భాస్కర్, భరత్‌లు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలతో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాగునీటిని తాగడం వల్ల అస్వస్థతకు గురైనట్లు వారు తెలిపారు. వెంటనే వారిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఎవరికీ ఎలాంటి ఇబ్బందీ లేదని తెలిపారు.

గ్రామంలో అధికారుల పర్యటన

కలుషితనీరు తాగి అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న అధికారులు బేలోడు గ్రామంలో పర్యటించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నీటిని పరీక్ష నిమిత్తం లాబ్‌కు పంపారు. రాయదుర్గం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆర్డీవో నిశాంత్ రెడ్డి, తహశీల్దార్ వేణుగోపాల్, వైద్యాధికారులు డాక్టర్ రమేష్, మురళి, ఎస్ఐ సునీతలు పరామర్శించారు. అస్వస్థతకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే గ్రామంలో కొళాయి పైపులు, ట్యాంకుల వద్ద బ్లీచింగ్ పౌడర్ చలించే ఏర్పాటు చేశారు.

ట్యాంకులను శుభ్రం చేయించాం
గ్రామ సర్పంచి ఉమేష్ రెడ్డి

గ్రామంలో సీజనల్ వ్యాధుల వల్ల జ్వరం, వాంతులు విరోచనాలు అయ్యాయని, అస్వస్థతకు నీరు కారణం కాదని సర్పంచి ఉమేష్‌రెడ్డి తెలిపారు. మే 1వ తేదీన గ్రామానికి సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించామన్నారు.

కాపు పరామర్శ

రాయదుర్గం : గుమ్మగట్ట మండలం బేలోడు గ్రామంలో కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైన రాయదుర్గం ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను రాష్ట్ర ప్రభుత్వ విప్, రాయదుర్గం శాసనసభ్యులు కాపు రామచంద్రారెడ్డి మంగళవారం పరామర్శించారు. జరిగిన పరిణామంపై వారితో అడిగి తెలుసుకున్నారు. బాధితులందరికీ మెరుగైన వైద్యం అందేలా చికిత్సలు అందించాలని ఆసుపత్రి సూపరిండెంట్ మాధవిని ఆదేశించారు. అనంతరం ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున రూ.13 వేల సాయాన్ని అందించారు.

బాధాకరమైన ఘటన : కాలవ

కలుషిత నీటితో బేలోడు గ్రామస్తులు అస్వస్థతకు గురికావడం బాధాకరమైన ఘటన అని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తెలిపారు. తాగునీరు కలుషితమై వాంతులు, విరేచనాలతో చికిత్స పొందుతున్న వారిని ఆసుపత్రిలో పరామర్శించారు. కలుషిత నీటి ద్వారానే తాము అనారోగ్యానికి గురయ్యామని పలువురు బాధితులు ఆయన ఎదుట వాపోయారు. స్థానిక సర్పంచి, అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ సంఘటన జరిగిందని కాలవ పేర్కొన్నారు. మూడు నెలలుగా బేలోడు గ్రామంలో తాగు నీరు సక్రమంగా రావడం లేదన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి బేలోడు గ్రామాన్ని వెంటనే సందర్శించాలన్నారు. శుద్ధమైన మంచి నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాగునీటి కలుషితానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట టిడిపి రాయదుర్గం పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలవ సన్నన్న, బేలోడు సంజీవ, సర్పంచి నాగరాజు, రోశయ్య, ఏకాంతప్ప కరెన్న, వేణు, ఆశోక్, సత్తి, కష్ణ, ప్రహ్లాద ఉన్నారు.



బదిలీపై వెళ్తున్న గ్రంథాలయ ఉద్యోగిని సన్మానిస్తున్న ఛైర్‌పర్సన్, ఉద్యోగులు

గ్రంథాలయ అధికారిణి ఆదిలక్ష్మి సేవలు ఆదర్శం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గ్రంథాలయ గ్రేడ్-1 అధికారి కాసు ఆదిలక్ష్మి సేవలు ఆదర్శనీయం అని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ అన్నారు. మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ రాయదుర్గం శాఖ గ్రంథాలయంలో గ్రేడ్-1 గ్రంథాలయ అధికారిణిగా పని చేస్తున్న కాసు ఆదిలక్ష్మి ఉద్యోగోన్నతిపై ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయ అధికారిణి ఆదిలక్ష్మిని ఆత్మీయంగా శాలువా, జ్ఞాపక అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ ఉమామోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆదిలక్ష్మి మంచి అధికారిణి అన్నారు. తాను మహిళ అయినందున సాటి మహిళలుగా కలిసి మెలసి పని చేయడం సంతోషంగా ఉందన్నారు. గ్రంథాలయాలపై మంచి అవగాహన కలిగి ఉండి ఎక్కడ సమస్య రాకుండా చూడటంలో తనదైన పాత్ర పోషించారని అభినందించారు. మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎల్ఎం.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆదిలక్ష్మి అందించిన సేవలు నిలిచిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

డిఎంహెచ్‌ఒకు విన్నవించిన నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని 104 ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమేష్, సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. మంగళవారం 104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటి పిలుపులో భాగంగా చేపట్టిన ఆందోళనలు రెండోవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఓను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 104ను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలు చేయాలన్నారు. ఫుడ్ అలవెన్స్ ట్రావెలింగ్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. బదిలీల సౌకర్యం కల్పించాలని, మూడు నెలలకు ఒకసారి ఉద్యోగులు, యాజమాన్యం ప్రతినిధులతో ఎంప్లాయీస్ గ్రీవెన్స్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగుల యూనియన్ జిల్లా నాయకులు తిప్పేరుద్ర, డీకే మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరతో మొక్కజొన్న కొనుగోలు

ఎపి మార్క్‌ఫెడ్ మేనేజర్ పిఎం పెన్నేశ్వరి

ప్రజాశక్తి-అనంతపురం



జిల్లాలో రబీ సీజన్‌లో రైతుల పండించిన మొక్కజొన్న పంటను ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.1962తో కొనుగోలు చేయనున్నట్లు ఎపి మార్క్‌ఫెడ్ మేనేజర్ పిఎం పెన్నేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లాలో మొక్కజొన్న పండించిన రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'అంగన్‌వాడీ'ని బలోపేతం చేద్దాం

ఐసీడీఎస్ అధికారులతో కలెక్టర్ ఎమ్.గౌతమి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మహిళల్లో రక్తహీనత, బాలబాలికల్లో పౌష్టికాహార లోపం, బాల్య వివాహలు-టీనేజీ ప్రెగ్నెన్సీలు వంటి అనేక సామాజిక సమస్యలపై విజయం సాధించడానికి అంగన్‌వాడీ వ్యవస్థను బలోపేతం చేయడమే ఏకైక మార్గమని కలెక్టర్ ఎమ్.గౌతమి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాలన వికేంద్రీకరణ యుగంలో క్షేత్ర స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రాధాన్యత పెరిగిందన్నారు. అందుకు తగ్గట్టుగానే అంగన్‌వాడీల నిర్వహణ సైతం ఉండాలన్నారు. అంగన్‌వాడీల్లో పరిశుభ్రమైన వాతావరణం కనిపించాలన్నారు. తల్లులు, పిల్లలకు వ్యక్తిగత శుభ్రత ప్రాధాన్యత తెలియజేస్తూ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాల్య వివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీల నివారణకు కౌమార దశలో ఉన్న యువత లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాల్య వివాహల నివారణలో పోలీసులు, అధికారులతో పాటూ ప్రజాప్రతిథుల సహకారం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, జిల్లా బాలల పర్యవేక్షణ అధికారి సుబ్రమణ్యం, సీడీపీవోలు, ఏసీడీపీవోలు పాల్గొన్నారు.

సాంకేతికత, సమన్వయంతోనే రహదారి భద్రత : కలెక్టర్

ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకోవడంతో పాటు వివిధ శాఖల మధ్య సమన్వయంతో రహదారి భద్రత మెరుగుపరచవచ్చని కలెక్టర్ ఎమ్.గౌతమి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా రహదారి భద్రత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్ల మీద వేగం పెరిగిందని, చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని, ఆ నిర్లక్ష్యం అధికారుల వైపు నుంచి ఉండకూడదన్నారు. ఐరాడ్ యాప్‌లో రోడ్డు ప్రమాదాల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయడం వల్ల రహదారి భద్రత కోసం మెరుగైన ప్రణాళికలు రూపొందించే అవకాశం ఉంటుందన్నారు. సీసీ కెమెరాల అవసరం ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీసీ శివరామప్రసాద్, అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు, రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ ఓబుల్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ కష్ణవేణి, పంచాయతీ రాజ్ శాఖ, జాతీయ రహదారుల అథారిటీ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా లేఅవుట్లు?

74-ఉడేగోళంలో నిబంధనలకు తిలోదకాలు.. పట్టించుకోని అధికారులు..



74-ఉడేగోళంలో వేసిన అక్రమ లే అవుట్

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మండల పరిధిలోని 74-ఉడేగోళం గ్రామంలో అక్రమ లే అవుట్లు వెలసినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. లే అవుట్లు వేసిన వ్యక్తులు అధికార పార్టీ నాయకులు కావడం, ప్రభుత్వ అధికారులకు ముడుపులు చెల్లించడం వల్లే అధికారులు నామమాత్రంగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం లేఅవుట్లు వేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా సర్వే నంబర్-72లో 23.05 ఎకరాల విస్తీర్ణంలో 260 ప్లాట్లు వేసి విక్రయించేశారు. తాజాగా సర్వే నంబర్-95లో 2.76 ఎకరాల విస్తీర్ణంలో ప్లాట్లు వేశారని పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి చెబుతుండగా, ఇదే సర్వే నంబర్‌లో 2.39 ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయేతర భూమిగా మార్చుకునే ప్రక్రియకు భూ యజమానులు దరఖాస్తు చేశారని రాయదుర్గం తహసీల్దార్ మారుతి చెబుతుండడం అనుమానాలకు తావిస్తోంది. పంచాయతీ, రెవెన్యూ అధికారులు విస్తీర్ణంకు సంబంధించి చెబుతున్న లెక్కల్లో సుమారు 37 సెంట్ల వ్యత్యాసం ఉంది. రాయదుర్గం నుంచి భూపసముద్రం వెళ్లే ప్రధాన రహదారిలో(74-ఉడేగోళం గ్రామంలో బీటీ రోడ్డు పక్కన) ఈ లేఅవుట్ ఉంది. ఈ లేఅవుట్‌కు భూపసముద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డు ఓ వైపు, ఆయతపల్లి గ్రామానికి వెళ్లే మరో రోడ్డు ఇంకో వైపు ఉన్నాయి. వ్యత్యాసం ఉన్న 37 సెంట్ల భూమి ఎలా వచ్చిందో అధికారులే తేల్చాల్సి ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లే అవుట్లు వేసేవారు ఎకరాకి 10 సెంట్ల చొప్పున సామాజిక అవసరాలకు, పంచాయతీలకు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రధాన రోడ్డు నుంచి వెళ్లేందుకు 40 అడుగులు, అంతర్గత రహదారులకు 33 అడుగుల మేర రోడ్లకు స్థలం వదలాలన్నది ప్రభుత్వ నిబంధన. గ్రామపంచాయతీ అనుమతి పొందాకే ప్లాట్లు విక్రయించాల్సి ఉంటుంది. ఇవేమీ పట్టించుకోకుండా నిర్వాహకులు ఇష్టారాజ్యంగా ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేసి ప్లాట్లుగా విభజించి రూ. లక్షల్లో వ్యాపారులు ఆదాయం గడిస్తున్నారు. ప్లాట్లను కొనుగోలు చేసిన వారు ఇళ్లను నిర్మించుకునేందుకు పంచాయతీ నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పంచాయతీ విస్తరణ అధికారి రఘురామ్‌రావు తెలిపారు. అక్రమ లేఅవుట్‌లలో వేసిన ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయరాదని రాయదుర్గం సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ పంపినట్లు ఆయన తెలిపారు. అక్రమంగా ప్లాట్లు వేసిన వారికి నోటీసులు ఇచ్చామని పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఇకనైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకుంటే ప్రభుత్వానికి, గ్రామపంచాయతీకి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉద్దేహాల్‌లో తాగునీటి ఎద్దడి

ప్రజాశక్తి-బొమ్మనహాల్



కాలిపోయిన మోటార్ పైపులు బయటకు తీసిన దశ్యం

మండల పరిధిలోని ఉద్దేహాల్ గ్రామంలో సుమారు 7000 జనాభా ఉంది. అయితే గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొనడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 3 కి.మీ. దూరంలోని దేవగిరి క్రాస్ సమీపంలో ఉన్న ఓ రైతు పొలంలో బోరుబావి వేసి గ్రామానికి తాగునీరు సరఫరా చేసేవారు. అయితే బోరుబావుకి సంబంధించిన విద్యుత్ మోటారు మూడు రోజుల క్రితం కాలిపోవడంతో బయటకు తీసి మరమ్మతుల కోసం పంపించారు. దీంతో బందూరు రోడ్డులోని దళితవాడ, తిమ్మాలాపురం రోడ్డు, సచివాలయం సర్కిల్, జిల్లా పరిషత్ హైస్కూల్ సర్కిళ్లలోని ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మోటారు కాలిపోయిన తర్వాత ఒకరోజు మాత్రమే ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేశారాని, ఆ తర్వాత కనబడకుండా పోయారన్నారు. దీంతో విధి లేని పరిస్థితుల్లో ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలతో నీరు తెచ్చుకుంటున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు క్యాంపులో ఇంటికి చేతికి పంపులు ఉన్నాయని, అయితే గ్రామంలోని బీసీ, ఎస్సీ కాలనీల్లో ఎలాంటి నీటి సౌకర్యాలు లేక కుళాయి నీటి పైనే ఆధారపడాల్సి వస్తుందని వాపోతున్నారు. వేదవతి నది నుంచి నీరు సరఫరా చేసే మోటారు గతేడాది నుంచి పనిచేయడం లేదని, దీని వల్ల నీటి సమస్య తలెత్తింని పేర్కొంటున్నారు.

వివరణ: ఈ విషయమై ఎంపీడీవో షకీలా బేగంను వివరణ కోరగా.. మోటారు మరమ్మతులు చేయించి త్వరలోనే బిగించి గ్రామానికి నీరు అందిస్తామన్నారు.

విద్యతోనే భవిష్యత్తు : డిఇఒ

ప్రజాశక్తి-గార్లదిన్నె



పుస్తకాలను పరిశీలిస్తున్న డిఇఒ సాయిరాం

చదువుతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా విద్యాధికారి సాయిరాం సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. అనంతరం పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివినప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ఇంటర్, పదో తరగతి ఫెయిలైన విద్యార్థులు ప్రత్యేక శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని ఈసారి ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి తారా చంద్రానాయక్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్, ఎంఆర్‌సి సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పుట్లూరు తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు

పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి

టిడిపి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా

ప్రజాశక్తి-శింగనమల

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ రెండు వారాలుగా కురుస్తున్న వర్షాల కారణంగా అనేక మంది రైతులు పంటలను నష్టపోయారన్నారు. కొన్నిచోట్ల ధాన్యం తడిసి రంగు మారిందన్నారు. అయినా ఏ ఒక్క అధికారిగానీ, నాయకుడుగానీ రైతులను పట్టించుకున్న పాపానపోలేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి, మాజీ జెడ్పిటిసి రామలింగారెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు మారుతీనాయుడు, కోశాధికారి ఈడిగ శ్రీనివాసులు, మాసుల చంద్రమోహన్, పెద్ద నాగముని, మాజీ ఎంపిటిసిలు చంద్రాయుడు, వెంకటరాముడు, మునీంద్ర, బీసీ సెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కొయ్యగూర పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ టిడిపి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు చీనీ, దానిమ్మ, అరటి, మొక్కజొన్న తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. కావున వెంటనే నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు విజయ్‌కుమార్‌నాయుడు, శివశంకర్‌రెడ్డి, రవిచంద్రనాయుడు, రామాంజినేయులు, ఆదినారాయణరెడ్డి, చంద్ర, వెంకటనాయుడు, శ్రీనివాసులురెడ్డి, పెద్దిరాజు, కుల్లాయప్ప, చంద్ర, నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ టిడిపి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకుడు గేట్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు తక్షణసాయంగా ఎకరాకు రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పాండు, మాజీ ఎంపిపి శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణ, శ్రీనివాసనాయుడు, బాబయ్య, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

నార్పల : వర్షాలకు దెబ్బతిన్న పంటల రైతులకు ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను నట్టేట ముంచిందని మార్చినెలలో భారీ


గార్లదిన్నెలో ధర్నా నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

వడగండ్లు పడి నార్పల మండలంలో అరటి, బొప్పాయి, మొక్కజొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయన్నారు. అయినా ఇంత వరకు అధికారులు అంచనా కూడా వేయలేదన్నారు. వెంటనే అధికారులు పొలాల్లోకి వెళ్లి వర్షానికి పంటలు నష్టపోయిన రైతుల వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి పంపి పరిహారం అందించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పిట్టు రంగారెడ్డి, మండల కన్వీనర్ ఎర్రినాగప్ప, తెలుగు యువత చంద్రబాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జి పిఎల్.లక్ష్మీనారాయణ, కుళ్లాయప్ప, రైతు సాధికారిక కమిటీ రాజగోపాల్, సర్పంచి నాగార్జున, గ్రామ కమిటీ అధ్యక్షుడు భక్తవత్సల్, సత్తి, సోషల్ మీడియా దాసరి రాము, బూత్ కమిటీ నాగేంద్ర, చక్రవర్తి, గణేష్, మహేష్, హరీష్, తలారి మహేష్, వంశీ, మధు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

యాడికి : మండలంలోని చందన గ్రామానికి చెందిన రమణ (36) మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. 20 రోజుల క్రితం రమణ కుమారుడు అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో అప్పటి నుంచి మానసికంగా తీవ్ర వేదనకు గురయ్యేవాడు. ఈనేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఇంటి పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

యాడికి : మండల కేంద్రంలోని కోట వీధికి చెందిన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అశోక్ తమ్ముడు బాలరాజు (45) మంగళవారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి నీళ్ల క్యూరింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా అయింది. దీంతో స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే 108 ద్వారా తాడిపత్రికి తరలిస్తుండా మార్గంమధ్యంలోనే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోండి

గుత్తి : ప్రభుత్వం రాయితీపై ఇచ్చే వేరుశనగ విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రాల్లో రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ముస్తాక్ అహ్మద్ సూచించారు. ఈమేరకు మంగళవారం పట్టణంలోని పారిశ్రామికవాడలో ఉన్న పవన్ ఆగ్రో ఏజెన్సీలో వేరుశెనగ విత్తనాల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 శాతం రాయితీ తో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తామని తెలిపారు. కావున మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఈనెల 15వతేదీలోపు రైతులు పేర్ల నమోదు చేసుకోవాలని కోరారు.

గార్లదిన్నె : ఖరీఫ్‌లో సాగు చేసేందుకు ప్రభుత్వం సబ్సిడీతో సరఫరా చేసే వేరుశనగ కాయల కోసం రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి సోమశేఖర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఆర్‌బికె సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023 సంవత్సరానికి మండలానికి కె6 రకం వేరుశనగ కాయలు 2500 క్వింటాళ్లు కేటాయించినట్లు తెలిపారు. వీటికి క్వింటా ధర రూ.9,300 కాగా సబ్సిడీపోనూ రూతు 5,580 చెల్లించాల్సి ఉంటుందన్నారు. కావున అర్హులైన రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదార్ పాసు పుస్తకం, మొబైల్ నెంబర్ తీసుకుని దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలపై గేట్ మీటింగ్

ప్రజాశక్తి-రాయదుర్గం

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలపై మంగళవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున మాట్లాడుతూ 2023 మే 31 నుంచి జూన్ 9 వరకు సిఐటియు ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర ప్రచారజాతాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ (ఆప్కాస్) సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, మున్సిపల్ ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ ఇవ్వాలని, తదితర డిమాండ్ల పరిష్కారమే జాతా ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. జాతాలో భాగంగా ఈ నెల 31వ తేదీ హిందూపురం నుంచి ఒక బృందం, ఇచ్ఛాపురం నుంచా మరో బృందం ప్రతి మున్సిపల్ పట్టణానికి వెళ్లి అక్కడ కార్మికులను కలిసి వారి సమస్యల పరిష్కారానికి కృషి


మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలపై గేట్ మీటింగ్ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

చేస్తారన్నారు. అప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోతే, ఆందోళన కార్యక్రమాలకు పిలుపునివ్వడం లేక సమ్మె చేపడుతామని తెలిపారు. గేట్ మీటింగ్‌లో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాము, మల్లేసి, తిప్పేస్వామి, సిద్ధ, ఆదిలక్ష్మి, బసవరాజు, తిప్పేసి, కార్మికులు పాల్గొన్నారు.

పారదర్శకంగా బదిలీలు చేపట్టండి

ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కౌన్సిలింగ్ విధానానికి విఘాతం కలిగిస్తూ ప్రజా ప్రతినిధుల సిఫారసు మేరకు ముఖ్య మంత్రి కార్యాలయం నుంచే నేరుగా చేపట్టిన టీచర్ల అక్రమ బదిలీలను నిలుపుదల చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు డిమాండ్ చేశారు. మంగళవారం ఉపాధ్యాయ భవన్‌లో ఎపిటిఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పారదర్శకంగా ఉపాధ్యాయ బదిలీలను చేపడతామని ఓ వైపు విద్యాశాఖ మంత్రి చెబుతూనే మరోవైపు బదిలీలకు ముందే ప్రజా ప్రతినిధుల సిఫారసు మేరకు నిబంధనలకు విరుద్ధంగా కౌన్సిలింగ్ విధానానికి తూట్లు పొడుస్తూ సిఫారసు బదిలీలను చేయడం వల్ల సుదీర్ఘకాలంగా గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. బదిలీల కోసం ఎదురుచూస్తున్న వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి ఈ సిఫారసు బదిలీల వల్ల అన్యాయం జరుగుతుందన్నారు. వెంటనే సిఫారసు బదిలీలను రద్దు చేసి


సమావేశంలో మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు

బదిలీలు, ప్రమోషన్, మార్గదర్శకాలను, షెడ్యూల్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేష్.జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, జిల్లా అసోసియేట్ కార్యదర్శి బి.హనుమప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయ్ నాగరాజు, సాకే భాస్కర్, సతీష్, రాష్ట్ర కౌన్సెలర్ రమణ, నాయకులు అర్షద్, వన్నప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి డాక్టర్ కళ్యాణ్‌కుమార్, డాక్టర్ ఉషారాణి ఆధ్వర్యంలో గర్భిణులకు మంగళవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇందులో భాగంగా 16 మంది హైరిస్క్ గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ముగ్గురిని స్కానింగ్ కోసం తాడిపత్రిలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారిణి భారతి, హెల్త్ సూపర్‌వైజర్ చిన్న కంబయ్య, లక్ష్మీకుమారి, నాగరత్నాలు, స్టాఫ్‌నర్స్, ఆదిలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ శివరాజ్, హెల్త్ ప్రొవైడర్లు పల్లవి, నందినీ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప: గర్భిణులు ఆకుకూరలు, కోడిగుడ్లు వాడితేనే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ కార్తీక్‌కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వివిధ గ్రామాల నుండి వచ్చిన గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు అందజేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం దివంగత చంద్రశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం తనయుడు కొండారెడ్డి వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులు, బాలింతలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, సూపర్‌వైజర్లు వెంకటరమణ, వసంత, సరోజ, ఎఎన్‌ఎం రాధమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే తొలగిస్తాం : ఎంపిపి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి దాసరి సునీత

అవినీతికి పాల్పడి ఎమ్మెల్యేకు చెడ్డ పేరు తెస్తే చర్యలు తీసుకోవడంతోపాటు విధుల నుంచి తొలగిస్తామని ఎంపిపి దాసరి సునీత హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఉన ఎంపిపి ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బంది విధుల నిర్వహణలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి చెడ్డ పేరు తెచ్చే విధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ప్రభుత్వం కూలీల వలసలను నివారించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పిస్తోందన్నారు. అలాంటి పథకంలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు, సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అవినీతికి పాల్పడకుండా గ్రామాల్లో కూలీలకు పనులు సక్రమంగా కల్పించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి దామోదరమ్మ, ఎపిఒ శ్రీదేవి, ఈసీ ప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వర్షాలతోనూ రాజకీయమా?

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

టిడిపి నాయకులు వర్షాలతోనూ రాజకీయాలు చేయడం బాధాకరమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని 6వ డివిజన్‌లో కార్పొరేటర్ సుజాతతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలనా సౌలభ్యం కోసం అనంతపురం అర్బన్ మండలానికి అదనంగా ప్రత్యేక తహశీల్దార్‌ను కేటాయించాలని విన్నవించగా కేటాయించడం సంతోషకరమన్నారు.ఈ కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతిసాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా ఛైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, వక్ఫ్‌బోర్డు సెక్రటరీ ఖాజా, బీసీ విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ రమేష్‌గౌడ్, అనుబంధ


మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, సైఫుల్లా బేగ్, కొర్రపాడు హుసేన్‌పీరా, జేసీఎస్ కన్వీనర్ ఆలుమూరు శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు జాహ్నవి, శ్రీనివాసులు, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, డివిజన్ కన్వీనర్ యోగి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

104 సిబ్బందికి జీతాలు చెల్లించాలని వినతి

బెలుగుప్ప : నాలుగు నెలలుగా జీతాలు చెల్లించలేదని, వెంటనే చెల్లించాలని మండల కేంద్రంలోని 104 సిబ్బంది డాక్టర్ కార్తీక్‌కుమార్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే చాలీచాలని వేతనాలతో జీవిస్తున్న తమకు నాలుగు నెలలుగా వేతనాలే ఇవ్వకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. కావున ఉన్నతాధికారులతో చర్చించి వెంటనే వేతనాలు చెలించేందుకు కృషి చేయాలని కోరారు.

వినతుల పరిష్కారమే 'జగనన్నకు చెబుదాం' లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ


జగనన్నకు చెబుదాం ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజా వినతుల పరిష్కారమే లక్ష్యంగా 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం చేపట్టినట్లు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం ఉరవకొండ, విడపనకల్ మండల కేంద్రాల్లోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ హాలులో 'జగనన్నకు చెబుతాం' ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా విజయవాడ నుంచి ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించే కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఒక సరికొత్త చరిత్రకు నాంది పలికిందన్నారు. ప్రజా సమస్యలపై ఇప్పటి వరకు నేరుగా ముఖ్యమంత్రికే సమస్యలు చెప్పుకునే వ్యవస్థ దేశంలో ఎక్కడా లేదన్నారు. ఈ కార్యక్రమంలో వల్ల ప్రజల సమస్యలు పరిష్కారం అవడమే కాకుండా వారికి పాలన మరింత చేరువవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ, విడపనకల్ ఎంపిపిలు చంద్రమ్మ, కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి పార్వతమ్మ, ఎంపిడిఒ శ్రీనివాసులు, వైస్ ఎంపిపి నరసింహులు, సర్పంచులు లలిత, మోనాలిసా, ఉప సర్పంచులు వన్నప్ప, ఓబులమ్మ, కురుబ ఎంబిసి రాష్ట్ర డైరెక్టర్లు గోవిందు, జోగి వెంకటేష్, పంచాయతీ సెక్రటరీ మహబూబ్‌బాషా, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, సుంకన్న, నాగరాజు, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం సవీరాలో అరుదైన శస్త్రచికిత్స

రీనల్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ దుర్గాప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి 5 లక్షల మందిలో ఒక్కరికి మాత్రమే వచ్చే హైడాటిడ్ సిస్ట్ వ్యాధి సోకిన వ్యక్తికి అనంతపురంలోని సవీరా ఆసుపత్రిలో విజయవంతంగా శస్త్రచిక్తిత్స చేసినట్లు సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్టు, రీనల్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు అనంతపురం జిల్లాకు చెందిన 54 ఏళ్ల వ్యక్తికి ఏడాది నుంచి కడుపునొప్పి, ఆకలి లేకపోవడం లాంటి సమస్యలు ఉండేవన్నారు. అయితే మూడు నెలలుగా విపరీతంగా వాంతులు కావడం, ఆరు నెలల్లో బరువు గణనీయంగా తగ్గిపోయాడు. ఈనేపథ్యంలో చికిత్సకు వచ్చిన ఆయనకు వైద్యపరీక్షలు చేయగా కుడివైపు మూత్రపిండం బాగా వాపు వచ్చినట్లు కనిపించిందన్నారు. దీంతో మరిన్ని పరీక్షలు చేస్తే ఆయనకు ఏకంగా 15 లి 17.5 సెంటీమీటర్ల పరిమాణంలో ఉన్న అతిపెద్ద హైడాటిడ్ సిస్ట్ ఉన్నట్లు తేలిందన్నారు. ఈ కేసును సవాల్‌గా తీసుకుని శరీరంలో ఉండే పరాన్నజీవులను చంపడానికి మనిషి బరువులో ప్రతి కిలోకు 10 మిల్లీగ్రాముల చొప్పున ఆల్బెండజోల్ ఇచ్చామన్నారు. తర్వాత లాపరోటమీ అనే శస్త్రచికిత్స చేసి అత్యంత జాగ్రత్తగా హైడాటిడ్ సిస్ట్‌ను, మూత్రపిండాన్ని చాలా కష్టంమ్మీద తొలగించామన్నారు. శస్త్రచికిత్సకు 4 గంటల సమయం పట్టిందన్నారు. మూడు రోజులకు రోగి బాగా కోలుకున్నట్లు వివరించారు. నాలుగో రోజు ఎలాంటి సమస్యలు లేకపోవడంతో డిశ్చార్జి చేసినట్లు తెలిపారు. తీసిన భాగాన్ని బయాప్సీకి పంపగా మూత్రపిండంలోని హైడాటిడ్ సిస్ట్ అని నిర్ధారణ అయినట్లు తెలిపారు.

ఇళ్ల పట్టాలిచ్చి మాట నిలుపుకున్నాం...

ఉరవకొండ : పిఎబిఆర్ వెనుకజలాలతో ముంపునకు గురైన మండలంలోని మైలారంపల్లి గ్రామవాసులకు ఇళ్లపట్టాలు ఇచ్చి మాట నిలబెట్టుకున్నానని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. ఈమేరకు 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' కింద మైలారంపల్లి ముంపు బాధితులకు 61 మందికి మంజూరైన ఇళ్ల పట్టాలను మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇల్లు లేని పేదలందరికీ సొంతిల్లు కల్పించడమే సిఎం జగన్ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా కుల,మత రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ఇళ్ల స్థలాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో మైలారంపల్లిలో ముంపునకు గురైన ఇళ్లను పరిశీలించేందుకు వచ్చినప్పుడు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని విన్నవించారన్నారు. దీంతో ఎత్తయిన ప్రాంతంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. అయితే వీటిని ఇవ్వకుండా కొందరు అడ్డుకున్నారన్నారు. అయినా వెనుకడుగు వేయకుండా పేదలకు పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వ సహకారంతో వీలైనంత త్వరగా ఇళ్లు కూడా నిర్మించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైలారంపల్లి వాసులు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై విహరించిన శ్రీవారు

ఉరవకొండ : బ్రహోత్సవాల్లో భాగంగా పెన్నఅహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి మంగళవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఇఒ విజయ్‌కుమార్, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గజ వాహనోత్సవం

రాయదుర్గం: పట్టణంలో వెలసిన ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గజ వాహనోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో రాయదుర్గం తాలూకా బ్రాహ్మణ సంఘం, వీరశైవ లింగాయత్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

దుకాణాలపై అధికారుల దాడులు

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లోని దుకాణాలపై మంగళవారం సాయంత్రం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ కవర్లను వారు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. దుకాణదారులకు జరిమానా విధించినట్లు మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాసులు తెలిపారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వస్తువులు విక్రయిస్తే చర్యలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ శరత్ చంద్ర, శానిటరీ ఇన్స్పెక్టర్ రంగయ్య, సచివాలయాల అధికారి ఇమామ్ హుస్సేన్, టీపీబీఓ తమీమ్, శానిటరీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం రైతుల ఆందోళన


ఆందోళన చేస్తున్న రైతులు

ఉరవకొండ : విడపనకల్లు వ్యవసాయ సహకార సంఘం సొసైటీ ద్వారా పాల్తూరు గోడౌన్‌కు ఎరువులు సరఫరా చేయాలని పలువురు రైతులు మంగళవారం గోడౌన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సొసైటీలోని అధికారుల నిర్లక్ష్యం కారణంగా రెండు సంవత్సరాలుగా ఎరువులు సరఫరా నిలిపివేశారని ఆరోపించారు. దీంతో కరకముక్కల, మాలాపురం, చీకులగురికి, హావలికి, పాల్తూరు గ్రామాల రైతులు నష్టపోవడమే కాకుండా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అధికారులు పట్టించుకోలేదన్నారు. చేసేది లేక ఆందోళనకు దిగినట్లు తెలిపారు. ఐదు గ్రామాల పరిధిలోని రైతులు ఎక్కువ శాతం పత్తి, మొక్కజొన్న, సద్ద, వేరుశనగ తడితర పంటలు సాగు చేస్తారన్నారు. కావున జిల్లా అధికారులు స్పందించి రైతులకు సొసైటీ ద్వారా ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మాలింగ, సుంకన్న, ఓబులేసు, రామకృష్ణ, సీనా, సిద్ధప్పరెడ్డి, నాగరాజు, షబ్బీర్, బసవరాజు, శివ, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

వడ్డీ కట్టించుకుని రెన్యువల్ చేయాలి

నార్పల : రైతుల నుంచి కేవలం వడ్డీ మాత్రమే కట్టించుకుని పంట రుణాలను రెన్యువల్ చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు రంగాపురం పుల్లప్ప డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని వివిధ బ్యాంకుల్లో ప్రస్తుతం రైతుల పంట రుణాలకు రెన్యూవల్ చేస్తున్నారన్నారు. అయితే అసలు, వడ్డీ చెల్లిస్తేనే రెన్యూవల్ చేస్తామని చెబుతున్నారన్నారు. లేకుంటే చేయమని చెబుతుండటం తగదన్నారు. ప్రస్తుతం రైతులు పంటలు పండగ తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, కేవలం వడ్డీ మాత్రం కట్టించుకుని రుణాలను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మీనుగ రామాంజనేయులు, వీరన్న, శివయ్య, నారాయణ, చిన్న నల్లప్ప, రాజా, రామకృష్ణ, హాజీవలి పాల్గొన్నారు.

త్వరలో వడ్డెర విద్యార్థులకు పురస్కారాలు

అనంతపురం : రాష్ట్ర, జిల్లా వడ్డెర సంఘం ఆధ్వర్యంలో పదో తరగతిలో 560కుపైగా మార్కులు, ఇంటర్‌లో 9.8 గ్రేడ్ సాధించిన వడ్డెర విద్యార్థులకు త్వరలో ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షుడు దేవళ్ళ మురళి, ఉపాధ్యక్షులు చల్లా రామాంజనేయులు యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పరశురాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీలోపు ప్రతిభా పురస్కారాల కోసం తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

ఎస్‌కెయులో కారుణ్య నియామకాలు

అనంతపురం : కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఉపకులపతి ఎం.రామకృష్ణారెడ్డి మంగళవారం నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎం.వి.లక్ష్మయ్య, బోధనేతర సిబ్బంది, ప్రెసిడెంట్ ఆదినారాయణరెడ్డి, సెక్రటరీ శాంతిలింగం, వైస్ ప్రెసిడెంట్ రాము పాల్గొన్నారు.

సమస్యలను 'జగనన్నకు చెబుదాం'

పుట్లూరు : సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవల్లో ప్రజలకు ఎదురయ్యే సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు సిఎం జగన్ నూతనంగా 'జగనన్నకు చెబుదాం'అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలో అరకటవేముల గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి జగనన్న తానే స్వయంగా ప్రజల ముందుకు వస్తున్నాడన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జగనన్నే వింటారన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి

బ్రహ్మోత్సవాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

కడప జోనల్ ఛైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల ఓబులేసు

ప్రజాశక్తి-ఉరవకొండ

మండల పరిధిలోని పెన్నఅహోబిలం బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉరవకొండ డిపో నుంచి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులను నడపనున్నట్లు ఎపిఎస్ ఆర్టీసీ కడప జోనల్ ఛైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల ఓబులేసు తెలిపారు. ఈమేరకు మంగళవారం స్థానిక డిపో నుంచి ఏర్పాటు చేసిన బస్సును ప్రారంభించి పెన్న అహోబిలం వరకూ బస్సులోనే ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవానికి వచ్చే ప్రయాణికులు, భక్తులందరూ ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు. అనంతరం ఉరవకొండ గ్యారేజీని సందర్శించి సూచనలు, సలహాలు ఇచ్చారు. తర్వాత డిపో ప్రాంగణంలో ఉన్న దుకాణాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్నోబిలం ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ అశోక్‌కుమార్, డిపో మేనేజర్ బాలాజీదయాల్, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్, జిల్లా రోడ్డు సేఫ్టీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు, అధికారులు, ఆర్టీసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిటి సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆర్‌డిటి సెట్–2023 విద్యా సంవత్సరం ఆర్‌డిటి సెట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌డిటి ఎడ్యుకేషన్ డైరెక్టర్ జి.మోహన్ మురళీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం అర్బన్‌లోని ఏదైన ప్రభుత్వ పాఠశాలలో చదివి (స్టేట్ సిలబస్) 500 మార్కులు పైబడి సాధించిన విద్యార్థులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే ప్రయివేట్ పాఠశాలలో చదివిన విద్యార్థులు అనర్హులు అన్నారు. సెంట్రల్ సిలబస్‌లో 420పైబడి మార్కులు సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సెంట్రల్ సిలబస్ రిజల్ట్స్ వచ్చిన తరువాత దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 08554–271353, 271354 నెంబర్లను సంప్రదించాలని కోరారు.